# జాబిల్లికి ఇక 1437 కిలోమీటర్లే!

## - చంద్రయాన్-3 రైజింగ్ ఆపరేషన్ సక్సెస్




శ్రీహరికోట (తడ), ఆగస్టు 9 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరోసారి చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని జాబిల్లికి దగ్గరగా మళ్లించింది. బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి రైజింగ్ ఆపరేషన్ జరిపారు. ఇప్పటిదాకా చంద్రునికి దూరంగా 4313 కిలోమీటర్ల పరిభ్రమిస్తున్న ఈ ఉపగ్రహాన్ని 1437 కిలోమీటర్ల దూరం వైపు మళ్లించారు. బుధవారం నాటికి 174 కిలోమీటర్ల దగ్గర దూరం, 1437 కిలోమీటర్ల దూరపు కక్ష్యలో చంద్రయాన్-3 ప్రయాణిస్తోంది. ఈ నెల 14న మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు మరోసారి రైజింగ్ ఆపరేషన్ నిర్వహించి జాబిల్లికి అత్యంత సమీప కక్ష్యలోకి చంద్రయాన్-3ని మళ్లిస్తామని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. 16న ఇంకో ప్రయోగం ఉంటుందని పేర్కొన్నారు. అంతా విజయవంతమైతే ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు చంద్రునిపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ అవుతుందని ఇస్రో ప్రకటించింది.

**ఈ సారి అలా కాదు : సోమనాథ్**

చంద్రయాన్-3 ప్రయోగంపై ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పొరపాటు లేకుండా సాఫ్ట్ ల్యాండింగ్ జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దిశ భారత్ అనే సంస్థ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3లో ల్యాండర్ తన వైఫల్యాలను తానే సరి చేసుకోగలదని, సెన్సార్లతో సహా అందులోని అన్నీ ఫెయిలైనా కూడా ల్యాండర్ చంద్రుని మీద సాఫ్ట్ ల్యాండింగ్ కావడం ఖాయమని స్పష్టం చేశారు. ల్యాండర్ చంద్రునిపై దిగేటప్పుడు గతంలో జరిగిన పొరపాటు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఇస్రో ఛైర్మన్ వివరించారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# మార్మోగిన గుడివంక ఆలయం



విశేషాలంకరణలో శ్రీ సుబ్రమణ్యస్వామి

ఆలయం వెలుపల భక్తుల తాకిడి

గుడుపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త : గుడుపల్లె మండలం పెద్దగొల్లపల్లి సమీపం కర్ణాటక సరిహద్దుల్లో పశ్చిమ వాహినిగా పిలిచే గుడివ oక ఆలయం బుధవారం హరోంహరా వేల్ మురుగా నామ స్మరణతో మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి మొక్కులు కలిగిన భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈసందర్భంగా శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామికి ఉదయం నుంచే విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కులు కలిగిన భక్తులు ఒళ్లు గగుర్పాటు కలిగించే విన్యాసాలు చేస్తూ ఒంటికి కొక్కేలు, నోటికి శూలాలు తగిలించుకుని వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు రాతి గుండ్లు లాగుతూ కొండవరకు వేల్ మురుగా అంటూ భక్తి పారవశ్యంతో చేరుకోవడం కన్పించింది. తొలుత భక్తులు ఆలయ కింద భాగంలో ఉన్న పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి గంగాధరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కుప్పం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. గుడివంక ఆలయ ప్రాంతం రాత్రి వరకు భక్తులతో నిండిపోయి కన్పించింది. ఎమ్మెల్సీ భరత్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కాగా గురువారం స్వామివారి హుండీలను లెక్కించడం జరుగుతుంది. ఆలయంకు వచ్చిన భక్తులకు పాలక కమిటీ, దేవదాయ శాఖ అధికారులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేపట్టారు.

# హరోం...హర

## కావళ్ళతో కళ కళ-కడలితరంగంలా కదలి వచ్చిన భక్తజనం

శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త : దక్షిణకైలాసం ఆధ్యాత్మికతకు నిలయం. నెల నెలా ఓ ఉత్సవం భక్తుల సంబరం. సాధారణంగా ఈ దివ్యక్షేత్రంలో ఆది నుంచి ఏ ఉత్సవం అయినా రాత్రి ఘడియలున్నపుడు నిర్వహించటం ఆనవాయితి. ఆలయ ఇఒ వికె సాగర్‌బాబు ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయంలోని అందరు సిబ్బందిని కుమారస్వామి కొండపై పర్యవేక్షణకు నియమించారు. వారికి విధి విధానాలు సూచనలు చేసారు.కానీ ఆయన మాత్రం అందుబాటులో లేదు. వేలాది మంది హాజరయ్యే ఉత్సవాల సమయాల్లో కూడా ఇఒ అందుబాటులోలేకపోవటం పై పలు విమర్శలు చోటు చేసుకున్నాయి. ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహచరులు బైఠాయించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ప్రతి ఒక్కరికి సుదర్శన భాగ్యం కల్గించారు.

**హరోం హరా మురుగ...**

శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై జరుగుతున్న మురుగన్ బ్రహ్మోత్సవాల్లో ఆడికృత్తిక సందర్భంగా బుధవారం సాయంత్రం అయిదు గంటలకు అందిన సమాచారం మేరకు 40వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు సమాచారం.మధ్యాహ్నం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలి వస్తున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం, దివ్యక్షేత్రం. ఈ దివ్యక్షేత్రంలో ధార్మిక కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంది. నెల నెలా దేవస్థానం తరఫున ఓ ఆధ్యాత్మిక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు.' ఆడిమాసంలో (ఆషాఢం) నిర్వహించే ఉత్సవాలు ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు.ఈ ఉత్సవాల్ని శ్రీకాళహస్తీశ్వరా లయంలో చెంగల్వరాయ స్వామి బ్రహ్మోత్సవాలుగాను, అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్సవాలుగా నిర్వహిస్తున్నారు. తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరుడు



కావళ్ళతో మొక్కులు తీర్చుకొనుటకు తరలి వచ్చిన భక్తులు



ఆలయంలో దర్శన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఛైర్మన్

స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తుంటే ఆయన తనయుడు కుమారస్వామి తన వద్దకు పరుగున వచ్చే భక్తులకు విజ్ఞానాన్ని ఒసగుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఆలయంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. స్థానిక భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మురుగన్ దర్శనం చేసుకున్నారు. మదినిండా భక్తి భావం, భక్తి పారవశ్యంతో భుజంపై కావడి, శుభం జరగాలనే ఆకాంక్షతో పసుపు బట్టలు ధరించిన భక్తులు తరలి వచ్చారు.ఎటు చూసినా కావళ్ళతో 'హరోంహర'అంటూ మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు కల్గిన వారు పంబజోళ్ళ మోతలతో కావళ్ళను తీసుకొని కుమారస్వామి దర్శించుకున్నారు.తమిళనాడు సరిహద్దుల్లో గల శ్రీకాళహస్తిలో తమిళ సంప్రదాయాలు, సంస్కృతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తమిళ పండుగల్ని ఇక్కడ స్థిర పడిన వారు ఘనంగా జరుపుకుంటారు. గతంలో తమిళనాడులోని తిరుత్తణికి ఈ ప్రాంతాల నుంచి వెళ్ళే వారు. కానీ కుమారస్వామి ఆలయాన్ని తీర్చి దిద్దిన తరువాత భక్తులు ఇక్కడే దర్శించుకుంటున్నారు.

**ఒకటే జనం జనం...**

శ్రీకాళహస్తిలోని కుమారస్వామి తిప్ప జరుగుతున్న సుబ్రమణ్యం స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆడికృత్తిక సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. పెండ్లిమండపం నుంచి ఆర్‌టిసి బస్టాండు వరకు ఇసుకేస్తే రాలనంత రద్దీచోటు చేసుకుంది. ఓ వైపు భక్తులు మరో వైపు వారికి సదుపాయాలందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థల పంపిణిలు, మరోవైపు మజిలి దుకాణాలతో కళ కళ లాడింది.అధికారికంగా అందించిన సమాచారం మేరకు సాయంత్రం 6గంటలకు అందిన సమాచారం మేరకు తలనీలాలు పదివేల మంది. సుమారు 5వేల మంది అర్చనలు, సుమారు 2వేల కావళ్ళను అధికారికంగా జరుపుకున్నారు.భారీ ఎత్తున భక్తులు తరలివచ్చినా క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

# సమర యోధులను స్మరించుకుందాం : మంత్రి రోజా



ఆజాదీకా అమృత మహోత్సవ ఉత్సవాల్లో మంత్రి రోజా

వడమాలపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త: మన దేశానికి స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునేందుకు ఆజాదీకా అమృత మహోత్సవ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి రోజా పేర్కొన్నారు. వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో నా దేశం నా మట్టి ఆజాదికా అమృత మహోత్సవ్ వేడుకలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, అన్ని నియోజకవర్గాల్లోను నా భూమి నా దేశం(మేరీ మాటీ మేరీ దేశ్) నినాదంతో దేశభక్తిని చాటే ఈ ఉత్సవాల్లో రాష్ట్రంలో యువతపెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. పిడికిలి మట్టితో యువత, మట్టి దీపాలను వెలిగించి చెట్లను నాటి, జాతీయ జెండాలను ఎగుర వేయాలని కోరారు. మన రాష్ట్రంలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా అల్లూరి సీతారామరాజు గారి విగ్రహాన్ని ప్రధాన మంత్రి మోదీ చేత ఆవిష్కరింపచేశామని, ఆ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మన రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దఎత్తున వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారని అలాగే ఈ ఏడాది ఆగస్టు 13వ తేదీ నుంచి 15 వరకు మన రాష్ట్రంలో హర్ ఘర్ తిరంగాను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ప్రతి ఇంటి మీద మన మువ్వన్నెల జెండాను రెపరెపలాడించి దేశ భక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన సమర యోధులను స్మరించుకుంటూ ప్రతిరోజు, ప్రతి క్షణం, శరీరంలోని ప్రతి అణువు మాతృభూమి కోసం జీవించడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఈడీ మల్‌రెడ్డి, రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, తహసీల్దార్ సుబ్రహ్మ ణ్యం, ఎంపీడీవో భానుమూర్తి, మండల స్థాయి అధికారులు, వడమాలపేట ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కో-ఆప్షన్ సభ్యులు, రాష్ట్ర డైరెక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కళ్యాణమస్తులో... 444 మందికి రూ.3.60 కోట్లు లబ్ది

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**



కళ్యాణమస్తు లబ్దిదారులకు చెక్కు అందిస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప

చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త: వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా 3వ విడతలో జిల్లాలోని 444 మందికి 3.60 కోట్ల రూపాయల లబ్ది కలిగిందని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం 3వ విడత వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్దిదారులకు ఆర్థిక సహాయంను వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబికుమార్‌రాజా, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ, ఇతర సంబంధిత అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ సామాజిక వర్గాలు, పేద కుమార్తెల విభిన్న ప్రతిభావంతుల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కుటుంబాలకు చెందిన వధువుల తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.40 వేల నుండి రూ.1.50 లక్షల వరకు అర్హులైన వివాహితుల జంటలకు కుల ప్రాతిపదికన వివాహ ఖర్చుల నిమిత్తం విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 182 మంది ఎస్సీ లబ్దిదారులకు రూ.1.85 కోట్లు, 15 మంది ఎస్టీలకు రూ.15 లక్షలు, 187 మంది బిసీ లబ్దిదారులకు రూ.98 లక్షలు, 52 మంది మైనార్టీలకు రూ.52 లక్షలు ఈ పథకం కింద మంజూరు అయ్యాయన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ సర్వే 70 శాతం పూర్తి

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ డికె బాలాజీ**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 9 ప్రభాతవార్త : ఓటర్ల జాబితా సవరణ సర్వే ఇప్పటి వరకు 70 శాతం పూర్తి అయిందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పై రాజకీయ పార్టీల ప్రతినిధుల 3వ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈఆర్‌వోలతో , ఏఈఆర్‌వోలతో, ఎలక్షన్ డిటిలతో జిల్లా ఇంచార్జి కలెక్టర్ డిఆర్‌ఓ కోదండరామిరెడ్డితో కలిసి సర్వే పై వివరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ డికె బాలాజీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమావేశంలో వారు కోరే అంశాలు రికార్డు చేసి పరిశీలించి వివరించడం జరుగుతుందన్నారు. బిఎల్ఎలు, బిఎల్ఓలతో సమన్వయంతో ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహణ జరిగేలా సహకరించాలని నేటి వరకు 70 శాతం గృహాల సర్వే పూర్తి చేసామని ఈ నెల 21వ తేది లోపు మిగిలినవి కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ బిఎల్ఓ యాప్ ద్వారా, క్షేత్ర స్థాయిలో 49016 వివిధ రకాల ఫారంలు సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులు, వైఎస్ఆర్‌సిపి చంద్రశేఖర్, తెలుగు దేశం సుధారెడ్డి, ఐఎన్‌సి చింతామోహన్, ఈఆర్‌వోలు గూడూరు కిరణ్ కుమార్, వెంకటగిరి కోదండరామిరెడ్డి, శ్రీకాళహస్తి రామారావు, ఏఈఆర్‌ఓలు వెంకటరమణ, శిరీషా, ఎన్నికల తహశీల్దార్ సురేష, డిప్యూటీ తహశీల్దారులు కిరణ్మయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రంలో ఆకతాయిల ఆగడాలు!

## -మహిళ అర్తనాదాలు -రోడ్లపై యువతుల వేధింపు - లాడ్జిల్లో సెల్‌ఫోన్లలో చిత్రీకరణ -పట్టించుకునే ధైర్యం లేని పోలీసులు

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నిత్యం వివిధ పనులతో,వృత్తి రీత్యా మహిళలు చుట్టుపక్కల పరిశ్రమల్లో పనులకు వెళుతుంటారు. ఉపాధి కోసం చుట్టు పక్కల గ్రామాల నుంచి పొట్టచేతబట్టుకొని వస్తుంటారు. మరి కొందరు భక్తులు భక్తి భావంతో స్వామి అమ్మవార్ల దర్శనాలకు వచ్చి లాడ్జిల్లో బస చేస్తుంటారు. అయితే ఇక్కడ ఆకతాయిల ఆగడాలు మితిమీరి పోయి, వీధుల్లో మహిళలకు భద్రత లేదు. లాడ్జిల్లో మహిళలు స్నానం చేస్తుంటే వీడియోల చిత్రీకరణ. ప్రతి ఆకతాయికి ఏదో ఒక నాయకుడు సిఫార్సు, దీంతో చేతులేతేసిన పోలీసులు అధికారులు.**

శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆకతాయిల ఆగడాలకు హద్దులేకుండా పోతుంది.మహిళలు బయటకు వచ్చి క్షేమంగా ఇల్లు చేరుతుందనే నమ్మకం రోజు రోజుకు సన్నగిల్లుతుంది.గతంలో ఎన్నడూ లేని అభద్రతా భావం చోటు చేసుకుంటుంది.నడివీధుల్లో మహిళలను సెల్‌ఫోన్లలో చిత్రీకరణకు పూనుకుంటున్నారంటే వారి పరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థమౌతుంది. తమపై జరుగుతున్న మానసిక దాడులపై పోలీసులు టేకిట్ ఈజీ పాలసీని ఆచరిస్తున్నారంటే ఇక మహిళల అర్తనాదాలు ఎవరికి చెప్పుకోవాలి?అని తల్లడిల్లుతున్నారు.నెల క్రితం నెహ్రూవీధిలోని దేవస్థానంకు సంబంధించిన ఓ అతిధి గృహంలో అక్కడపని చేసే ఓ ఉద్యోగి అమ్మాయి గదిలో స్నానం చేస్తుంటే వీడియోలు తీసారని పోలీసులకు ఫిర్యాదు అందింది.ఇక మూడు రోజుల క్రితం తేరువీధిలోని ఓ ప్రైవెటు లాడ్జిలో బెంగుళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆమె తల్లి స్వామి దర్శనానికి వచ్చి స్నానానికి దిగగా అక్కడ పని చేసే ఓ ఘనుడు తన సెల్‌ఫోన్లో స్నానమాచరించే దృశ్యాలను చిత్రీకరిస్తూ పట్టుబడ్డాడు. ఇక మంగళవారం స్వర్ణముఖి బస్‌స్టాప్ పంచాయతీరాజ్ అతిధి గృహం వద్ద ఓ ఆకతాయిల గుంపు ఓ ప్రైవేటు టీచర్‌ను రోజూ వేధిస్తూ రోడ్డుమీదనే నడుస్తూంటే సెల్‌ఫోన్లో చిత్రీకరించటంతో ఆ యువతి తిరగబడింది. చివరకు పోలీసులను ఆశ్రయించింది. ఇవి కొన్ని బయటపడుతున్నది మాత్రమే. ఒకరేమిటి? పట్టణానికి చెందిన యువతులను, భక్తిభావంతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చే మహిళల పట్ల జరుగుతున్న వేధింపుల శృతిమించిపోతున్నాయి.



**మహిళలపై వేధింపులు... పోలీసుల మదలింపులు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహిళలకు అభద్రతా భావంగా మారుతుంది. పట్టణంలోని కొన్నికూడళ్ళలో ఆకతాయిలు గుంపులు గుంపులుగా చేరి మహిళలను వేధిస్తున్నారు. కొన్ని ప్రాంతాలు గంజాయి బ్యాచ్‌లు, తాగు బోతులకు అడ్డాగా మారింది.ముఖ్యంగా నూతనంగా నిర్మించిన స్వర్ణముఖి ఆనకట్ట, పంచాయతీరాజ్ అతిధి గృహం,ఎన్‌టిఆర్ నగర్,రిపబ్లిక్ సర్కిల్ వద్ద కొందరు ఆకతాయిలు బైఠాయించి వచ్చిపోయే మహిళలకు సంబందించి కామెంట్‌లు చేయటం మానసిక వేదనకు గురిచేస్తున్నారు.ఇటీవల కొందరు మహిళలు భరించలేక పోలీసుస్టేషన్‌కు వెళితే వారు టేకిట్ ఈజీ పాలసిని అనుసరిస్తున్నారు. ఓ యువతి తనను వేదిస్తున్నారని ధైర్యంగా పోలీసులకు చెబితే 'వారు మందలించి సరిపెట్టారంటే' ఆకతాయిలకు భయం ఉంటుందా? అనేది చర్చనీయాంశంగా మారింది.పోలీసు శాఖ ఇలా ఉంటే ఎవరు ఫిర్యాదు చేస్తారు? మందలింపు లేదా..స్టేషన్ బెయిల్ ? ఇదేనా మహిళల వేధింపులపై పోలీసుల స్పందన? అని చర్చించుకుంటున్నారు.

# పర్యాటకులను 18 బీచ్ టూరిజం... క్లస్టర్లకు ప్రతిపాదనలు

**-జిల్లా ఇంచార్జి కలెక్టర్ డికె బాలాజీ**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 9 ప్రభాతవార్త : కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్ 2019 మేరకు జిల్లాలో సముద్రతీరాన పర్యాటకులను 18 బీచ్ టూరిజం క్లస్టర్లకు ప్రతిపాదనలు పూర్తి స్థాయిలోసిద్ధం చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్ 2019 పై జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే సంజీవయ్య, వరప్రసాద్, డిఆర్‌ఓ కోదండరామి రెడ్డి, ఆర్డిఓ చంద్రముని జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్ 2019 ప్రతిపాదనల సాధ్యసాధ్యలను పరిశీలించాలని, ఫారెస్టు అనుమతులు, ఇతర శాఖల అనుమతులు, సౌకర్యాలు పరిశీలించి ప్రతిపాధనలు సిద్ధం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపాదనల ప్రదేశాలను పరిశీలించి నిర్ణయం తీసుకునే విధంగా ఉండాలని సూచించారు. ఉపాధి, ఉద్యోగాల విషయంలో టూరిజం అభివృద్ధి మంచిదని సూచించారు. గతంలో నిర్మించిన బివి పురం, నేలపట్టు గెస్ట్ హౌస్‌లు త్వరలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కౌన్సిల్ సభ్యులు కన్వినియర్, టూరిజం అధికారి రూపెంద్ర నాథ రెడ్డి ప్రతిపాదనలు చేపట్టిన బీచ్‌లను వివరించారు. కోట మండలం, శ్రీనివాస పత్రం బీచ్, పట్టపు పాలెం బీచ్, స్వర్ణముఖి నది మౌత్, మూన్ సైడ్ బీచ్, కొత్తపట్నం, చిల్లకూరు మండలం లైన్ కింగ్ బీచ్, గుమ్మల దిబ్బ బీచ్, వాకాడు మండలం - శ్రీనివాసపురం, రాయదోరువు, రావిగుంట పాలెం, వేదపాలెం, వైట్ కుప్పం, పుదికుప్పం, గొవిందపల్లి, తుపిలిపాలెం, తుపిలిపాలెం బ్రిడ్జి బీచ్ నవాబు పేట, కొందూరు పాలెం, అలాన్ బీచ్ వాటిని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో ఆర్‌డి టూరిజం రమణ ప్రసాద్, ఆర్కియాలజీ ఎడి శివప్రసాద్, పారెస్టు అధికారులు, ఫిషరీస్ ఎడి శ్రీనివాస నాయక్, ఎటిఓ ఉమాపతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత : ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత సాధించవచ్చని వైఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారదగా పేర్కొన్నారు. మండ కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆవరణంలో బుధవారం ఆజాదీక అమృతమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూ దేశంకు స్వాతం త్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మహోత్సవాలు నిర్వహించ తలపెట్టారని చెప్పారు. అలాగే ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కొమరగుంటలో 75 మొక్కలు నాటించి దత్తత తీసుకుని పెంచే కార్యక్రమం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మంగళగౌరీ, అధ్యాపకులు, వాలంటీర్లు, విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుమంది పేకాటరాయుళ్లు అరెస్ట్

వి.కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



మండలంలోని జెబి కొత్తూరు,గంధార మాకులపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఏడుమంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సిఐ ఆశీర్వాదం, ఎస్సై మనోహర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుమందిని అదుపులో తీసుకున్నామ న్నారు. వీరినుంచి 21వేల నగదు, ఆరు టువీలర్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## క్విట్ మోడి సేవ్ ఇండియా

– చిత్తూరులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన

**చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చిత్తూరు హైరోడ్డులో బుధవారం సిఐటియు, ఎఐటియుసి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో క్విడ్ మోడి సేవ్ ఇండియా నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నాయకులు కె.సురేంద్రన్, రమాదేవిలు మాట్లాడుతూ ప్రధాని మోడి అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలపై పన్ను భారం మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చడానికి 44 లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని, అలాగే 3 వ్యవసాయ చట్టాలతో రైతుల భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ప్రయత్నించారని ధ్వజమెత్తారు. ఈ నిరసన సిపిఐ, సిపిఎం మద్దతు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం, సిపిఐ కార్యదర్శులు నాగరాజు, గంగరాజు, జిల్లా సిఐటియు అధ్యక్షుడు పి.చైతన్య, నాయకులు ప్రసాద్, నాగరాజు,సావిత్రమ్మ,ఎఐటియుసినాయకులురమాదేవి, పి.చంద్ర, మణి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఒడియార్ ఉత్సవంలో ధర్మరాజులస్వామి దర్శనం

నారాయణవనం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణ వనంలో ప్రసిద్ది చెందిన ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవరోజు బుధవారం సాయంత్రం శడగోప్ర వాహనంపై నారాయణవనం, బిసికాలనీ, రెడ్డివీధిలో ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం స్వామి,అమ్మవార్లకు అభిషేకం నిర్వహి ంచారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, భక్తులు అధికస ంఖ్యలో పాల్గొన్నారు.

## దిగువ కనకపాలెంలో 4వ వార్డుకు నామినేషన్

నారాయణవనం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



మండలంలోని దిగువకనకపాలెం పంచయతీలోని ఖాళీగా వున్న 4వ వార్డుకు బుధవారం దామరపాకం మహేష్ నామినేషన్ వేశారు. ఈ స్థానంలో గతంలో భాస్కర్ అనే వ్యక్తి వార్డు మెంబర్‌గా వుండేవారు. ఆయన ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానానికి మహేష్ నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాన్ని పుత్తూరు అర్‌డబ్లుఎస్ ఎఇఇ వెంకటతరుణ్, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్‌రాజుకి అందజేశారు.

## ఘనంగా కూసూరులో ఆడికృత్తిక ఉత్సవాలు

కుప్పంరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :

మండలంలోని కూసూరు (పెరిపల్లం) అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలనుంచి మొక్కులు కలిగిన భక్తులు ఆలయం వద్దకు కావళ్లతో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ కన్పించింది.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

కుప్పంరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :



ప్రపంచ ఆదివాసి దినోత్సవంను కుప్పం ఎన్జీఒ భవనంలో గిరిజన సంఘాల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘ నేతలు రవినాయక్, కృష్ణప్ప మాట్లాడుతూ సంస్కృతి, వేషధారణలు వేరైనా మనమంతా భారతీయులమేనన్నారు. డా॥ అంబేద్కర్ లేకపోయిఉంటే గిరిజనులకు హక్కులు కూడా ఉండేవికాదన్నారు. ప్రభుత్వాలు కూడా గిరిజనులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణం , గిరిజన నేతలుపాల్గొన్నారు.

## అత్తినత్తంలో ఎమ్మెల్సీ భరత్‌చే గడపగడపకు

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



గుడుపల్లె మండలం అత్తినత్తం గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ గడపగడపకు మీ ప్రభుత్వం కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికెళ్లి వైకాపా ప్రభుత్వం తరపున వారికి అందిన సంక్షేమాల పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనకు ఓ అవకాశం కల్పించాలని తాను అన్ని వేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపిపి వరలక్ష్మి, జడ్పీటిసి కృష్ణమూర్తి, కో కన్వీనర్ రామూర్తి, నేతలు రవి తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ఎన్నికలకు నాలుగు నామినేషన్లు

శాంతిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



మండలంలోని మూడు పంచాయతీల్లో ఎన్నికలు జరగాల్సిన మూడు వార్డులకు గాను బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మఠం పంచాయతీ పదో వార్డుకు 1, కడపల్లి పంచాయతీ 10వార్డుకు 2, దండికుప్పం పంచాయతీ మూడో వార్డుకు 1 నామినేషన్ దాఖలైంది.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం

**కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో ఆడికృత్తిక పండుగ సందర్భంగా బుధవారం రాత్రి గణనాధునికి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన వాయవందలార్ వంశస్థులు ఉబయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వీరు పగలు మంగళవాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర వ్వహించారు. అలాగే రాత్రి సిద్ది బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు తిరిగి గ్రామోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై స్వామి అమ్మవార్లను వుంచి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈసందర భ్ంగా నారికేళ, కర్పూర హారతులతో స్వామివారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ఆజాదీక అమృత మహోత్సవ శిలాఫలకం ఆవిష్కరణ

**వెదురుకుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



ఆజాదీక అమృత మహోత్సవ శిలాఫలకం ఎంపిపి బండి నాగరాణి ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణంలో బుధవారం నేల తల్లికినమస్కారం – వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తికావడంతో ఆజాదీక అమృత మహోత్సవం కార్యక్రమంను ఏడాది పాటు ఉత్సవాలు జరుపుకోవడంకు ప్రధాన మంత్రి పిలుపు నిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ టీసీ సభ్యులు చలం పాళ్యం సుకుమార్, ఎంపిడివో సుధాకర్‌రావు,ఏపివో ఇందు, పంచాయితీ కార్యదర్శి వెంకటేష్, నాయకులు బట్టే సుబ్రమణ్యం, ధనంజేయులు రెడ్డి, సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కన్నుల పండువగా పుష్పపల్లకి సేవ

తవణంపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి ఆలయంలో జరిగిన ఆడికృత్తిక ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామివారికి పుష్పపల్లకిసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు అబ్బిరెడ్డివారి బాబురెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి, అరగొండ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్వామివారి సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే బాబు

శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి ఆలయంలో జరిగిన ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు బుధవారం దర్శించుకు న్నారు. ఎమ్మెల్యే వెంట నరేష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పార్ధసారధిరెడ్డి, సరకల్లు హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఊట్లవారిపల్లె దేవస్థానంకు గణనాధుని పట్టువస్త్రసాలు సమర్పణ

కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త:



పాకల మండలం ఊట్లవారిపల్లె పాళ్యం కొండపై వెలసిన శ్రీసుబ్రమణ్య స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం సత్యప్రమాణాలకు పెలపైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను అందజేశారు. కాణిపాకం దేవస్థానం తరపున ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు, వేదపండితులు పట్టువస్త్రాలను తీసుకెళ్ళగా, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు మోహిత్‌రెడ్డి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్ళి స్వామివారికి సమర్పించారు. వీరికి ఆలయ ఛైర్మన్ పట్టాభిరెడ్డి, ఈఓ మునిశేఖర్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వీరికి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో తెలంగాణా పోలీస్ డీజీ

కాణిపాకం, ఆగస్టు 9 ప్రభాతవార్త:



తెలంగాణా రాష్ట్ర పోలీస్ డీజీ మహేందర్‌రెడ్డి బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ రంగస్వామి, టెంపు ఇన్స్‌పెక్టర్ సురేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట స్థానిక పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగసభ

కుప్పంరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త :

మండలంలోని 29 పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి నేడు ఉపాధి కార్యాలయం ఎదుట సామాజిక తనిఖీ బహిరంగసభ జరుగుతుందని ఎంపిడిఒ జానకమ్మ, ఎపిఒ హరినాథ్ తెలిపారు. మండలంలో ఉపాధి, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఎల ద్వారా 11కోట్లతో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పూర్తయినట్లు తెలిపారు. కాగా ఈ పనుల్లో అధికారులు ఏమేర అవినీతి తేల్చుతారో వేచి చూడాలి.

## ఘనంగా శ్రీబాలసుబ్రమణ్యస్వామి హోమం

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



కుప్పం పట్టణం బైపాస్‌రోడ్‌లో వెలసిన శ్రీ బాలసుబ్రమణ వ్యస్వామి ఆలయంలో ఆడికృతికను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకం, హోమం నిర్వహించారు. రాత్రి స్వామివారి పుష్పపల్లకి, బాణవేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు రాజ్‌కుమార్,శాంతారాం, ప్రతాప్, రజనీ, సతీష్, వినయ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం

బాలాయపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



సుబ్రహ్మణ్యం గ్రామంలో వెలసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో ఆడి కృత్తిక సందర్భంగా శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వి.మురళీనాయుడు దంపతులు, సర్వేపల్లి సురేష్ దంపతులు, పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం బోర్డు వమెంబర్ రావి సత్యం నాయుడు దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

## ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇవ్వడమే సీఎం లక్ష్యం

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 18వ వార్డు బెస్తపాళెం ఆంజనేయస్వామి గుడి వద్ద, కట్టెల వీధి తదితర ప్రాంతాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తమకు పెన్షన్ రావడంలేదని, వస్తున్న పెన్షన్లు రద్దు అయ్యాయని పలువురు రామ్‌కుమార్‌రెడ్డికి చెప్పడంతో ఆయన ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ ఉమా మహేశ్వరి, కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్లు విజయలక్ష్మీ, మాడ జానకిరామయ్య, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, సుబ్బారావు, నాయకులు, కడప బ్రహ్మయ్య, మురళీకష్ణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 19న పాళెంకోట సర్పంచు ఎన్నికలు : ఆర్‌వో

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



మండలంలోని పాళెంకోట సర్పంచు ఎన్నిక ఈ నెల 19వ తేదీన జరుగుతుందని ఎన్నికల అధికారి జగదీష్ తెలిపారు. ఈ నెల 10వ తేది వరకు నామినేషన్ స్వీకరిస్తామని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

## ఘనంగా ఆడికృత్తిక పూజలు

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



పట్టణంలోని కుమ్మరకుంట పుష్కరిణి వద్ద వెలసియున్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా ఘనంగా పూజ నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని, అభిషేక గంగాజలాల కలిశాలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీ

– ఆర్ఐ, సచివాలయ అడ్మిన్ అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

వెంకటగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఆర్ఐ కోటేశ్వరరావు ఎన్టీఆర్ కాలనీ సచివాలయం అడ్మిన్ ప్రసాద్‌లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి తనిఖీలు చేశారు. పల్లా వనీత ఆరోపణలపై మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అధికారుల దాడులతో ఇతర ప్రభుత్వ ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు.

## రైతులకు లక్ష చీనీ మొక్కలు అందిచడమే లక్ష్యం

వెంకటగిరిరూరల్,ఆగస్టు 9 ప్రభాతవార్త:

మండలంలోని పెట్లూరులో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ హర్టికల్చర్ పరిశోదన కేంద్రంలో నిమ్మ తోపాటు ప్రతి ఎటా రైతులకు లక్ష ,చీనీ మొక్కలు అందించే విధంగా రంగపూరి నిమ్మపై సాత్‌గుడి చీనీ మొక్కలు అంటు కడుతున్నట్లు పెట్లూరు నిమ్మచీనీ పరిశోదన కేం ద్రం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి తెలిపారు. బుధవారం పరిశోదన కేంద్రంలో అంటు కడుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ రంగపూరి నిమ్మపై అంటు కట్టడం వల్ల వేరుకుళ్ళు తెగుళ్ళు తట్టుకొని నీటి ఎద్దడిని తట్టుకొని బీడు భూములల్లో సైతం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి అందించడమే దీని ప్రముఖ్యత అని వివరించారు. ఆంధ్ర రాష్ట్రంలో సాత్‌గుడి చీనీ రకం కు మంచి డిమాండ్ ఉండటంతో దీనిని రంగపూరి నిమ్మపై అంటు కడుతున్నట్లు వివరించారు. ఉద్యాన వన సాగులల్లో ప్రత్తుతం ముద్ద బంతి సాగు అధిక దిగుబడులుతో పాటు సాగు చేసే రైతులకు అదిక అదాయం వస్తున్నటు తెలిపారు.

## పరిశుభ్రతే మన ఆయుధం : ఎంపిడిఒ

వెంకటగిరిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:

వెంకటగిరి రూరల్‌లోని ప్రజలతో పాటు రూరల్ పరిధిలోని 20 గ్రామ పంచాయతీలల్లో పల్లె ప్రజలు తమ ఇంటితో పాటు, చుట్టు ప్రక్కలున్న పరిసరాలపై కూడ ప్రత్యేక దృష్టి ఉంచాలని గ్రామ కార్యదర్శులు వెంకటగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి తెలియజేశారు.బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లడుతూ పారిశుద్యం లోపించ కుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

తడ, ఆగస్టు 9 ప్రభాతవార్త :



సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన తిరుపతిలో జరిగిన నియోజకవర్గ అభివృద్ధి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఇన్‌ఛార్జ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ బాలాజి, ఇతర అధికారులతో కలిసి సంజీవయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులికాట్ ముఖద్వారాలు కోసం రూ.120 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. కాళంగి నదిపై గ్రాయను నిర్మాణం కోసం సుమారు పది కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా, వాటిని ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించి కూడా పేదలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులు హామీలిచ్చి ఉన్నారని చెప్పారు.

## సూళ్లూరుపేటలో ఆడికృత్తిక వేడుకలు

సూళ్లూరుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని దేవస్థానం ప్రాంగణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దేవస్థానం ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యరెడ్డి, దేవస్థాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :

కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని గోవిందపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆ గ్రామస్థులు బుధవారం తహశీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. గోవిందపల్లి గ్రామంలో సర్వేనంబర్ 164, 165లలో ఇసుకను డంపింగ్ చేసి రాత్రి సమయంలో ఇతర ప్రాంతాలకు తరలించాలని అక్కడ భూస్వాములు ప్రయత్నిస్తున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు జోక్యం చేసుకొని అక్రమ రవాణాను అడ్డుకోవాలని వారు కోరారు.

## మొబిన్‌బాషాకు ఎంఎల్‌సి మేరిగ పరామర్శ

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :



వైసీపీ మైనార్టీ నాయకుడు, కోట బిట్-2 ఎంపిటిసి షేక్ మొబిన్‌బాషా ఇటీవల కుటుంబ సభ్యులతో కారులో చెన్నైకి వెళుతూ మార్గంమధ్యలో దొరవారిసత్రం వద్ద ప్రమాదవశాత్తు కారు బోల్తాపడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో మొబిన్‌బాషాను ఆయన ఇంటికి వెళ్లి పలువురు వైసీపీ నాయకులు పరామర్శించారు. బుధవారం ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ తదితరులు మొబిన్‌బాషా నివాసానికి వెళ్లి ఆరోగ్యం విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ మాట్లాడుతూ మొబిన్‌బాషాకు ప్రమాదం జరిగిందని తెలిసి పరామర్శించినట్లు తెలిపారు. మేరిగ మురళీధర్ వెంట వైసీపీ నాయకులు రామచంద్రారెడ్డి, రాజారెడ్డి, గిరిబాబురెడ్డి, చిట్టమూరు భాస్కర్‌రెడ్డి, పరంధామిరెడ్డి, షేక్ జిలాని, ఖలీల్ భాయ్, కోఆప్షన్ సభ్యులు మొయిన్‌బాషా, ఇలియాజ్‌బాషా, ఇంతియాజ్ బాషా, ఖాదర్‌బాషా తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సిమ్‌కార్డులు అధికారులకు అందజేత

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :

విద్యుత్ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లే ముందు బుధవారం క్రింది స్థాయి సిబ్బంది ఏఈలకు సిమ్‌కార్డులు అందజేయగా, ఏఇలు సిమ్‌కార్డులు ఏడీలకు అందజేశారు. ఏడీలు డీఈలకు సిమ్‌కార్డులు అందజేశారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లకముందే బుధవారం అనధికారికంగా విద్యుత్ కోతలు మొదలయ్యాయి. అన్ని ప్రాంతాల్లోను 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి ఎన్ని గంటలకు పునరుద్ధరిస్తారో చెప్పలేమని అధికారులు చెప్పుండటం గమనార్హం. ఇదే సమయంలో అత్యవసరమైన మంచినీటిని ట్యాంకర్లలో ఫుల్ చేసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. అంతేకాకుండా వర్క్ టు రూల్ కింద విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. పనివేళల్లోనే విధులు నిర్వహిస్తామని ఉద్యోగులు ప్రకటించడం గమనార్హం. అంతిమంగా వినియోగదారులు రాత్రివేళల్లో ఇబ్బందులు పడక తప్పలేదు.

## చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం అన్యాయమని ఆ పార్టీ తిరుపతి జిల్లా బిసిసెల్ నాయకులు తీగల సురేష్‌బాబు, కోట పట్టణ అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్ అన్నారు. వారు బుధవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే చంద్రబాబుతో పాటు టీడీపీ నేతలపై కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. టిడిపి నేతల కోసమే పోలీసులు 307 సెక్షన్ వినియోగిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులకు టిడిపి ఎప్పుడూ భయపడదన్నారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేస్తుంటే ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఎలాంటి ఆంక్షలు విధించలేదని గుర్తు చేశారు. గవర్నర్ జోక్యం చేసుకొని చంద్రబాబుతో పాటు టిడిపి నేతలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## చిరు వ్యాపారులకు భద్రత కల్పించండి

కోట, ఆగస్టు 9 ప్రభాతవార్త :

కోటలోని ఆర్టీసీ షాపింగ్ దుకాణదారులు గత 30 సంవత్సరాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 24 కుటుంబాల వారు ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. తమకు భద్రత కల్పించాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. ఆ మేరకు సిఎంఓ కార్యాలయం నుంచి గూడూరు ఆర్డీఓకు, తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందింది. అన్ని సమస్యల పట్ల ముందు వరుసలో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్ తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## నేడు బిజెపిచే కలెక్టరేట్ ఎదుట ధర్నా

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :

గ్రామ పంచాయతీలకు కేంద్రం మంజూరు చేసిన నిధులు దారి మళ్లించారని ఇందుకు నిరసనగా గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సర్పంచులకు మద్దతుగా భాజపా ధర్నా చేపడుతుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివశంకర్ తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## కుప్పంలో రైళ్ల స్టాపింగ్‌లకు ప్రతిపాదనలు : ఎమ్మెల్సీ

కుప్పం, ఆగస్టు 9 ప్రభాతవార్త :

కుప్పం పట్టణంలో వివిధ రైళ్లకు స్టాపింగ్ కోరుతూ కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. అలాగే కుప్పం, గుడుపల్లె, మల్లానూరు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరడం జరిగిందన్నారు. కాగా ఈ రైళ్లకు స్టాపింగ్ కేటాయించాలని ఎంపిలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్పలు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారన్నారు. కాగా సెప్టెంబర్ 6నుంచి కుప్పంలో షిర్డీ రైలుకు స్టాపింగ్ కేటాయించనున్నారని తెలిపారు.

## నేటి నుంచి నల్లప్పరెడ్డియూరులో కావడి పండగ

శాంతిపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త :

మండలంలోని నల్లప్పరెడ్డియూరులో వెలసిన శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో నేటినుంచి కావడి పండగ నిర్వహి స్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం మహాగణపతి, నవగ్రహపూజ, శుక్రవారం స్వామివారి కళ్యాణోత్సవం, హోమం, గంగపూజ, ఉత్సవం ఊరేగింపు, శనివారం తలపై టెంకాయలు నదుపుట, కావళ్ల పండగ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

**నాగలాపురం, ఆగష్టు9 ప్రభాతవార్త:**
ఓ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ శ్రీకాళహస్తి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. స్థానిక పోలీసులు తెలిపిన సమాఛారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2017 సం॥ మే ఒకటవ తేదిన రాత్రి 8గం॥ల సమయంలో మండలంలోని నందనం క్రాస్ వద్ద ఉన్న హరి వైన్ షాపులో పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు గ్రామానికి చెందిన పాపయ్య కుమారుడు గజేంద్ర కుమారుడు(40), నందనం గ్రామానికి చెందిన సూరి(30)లు మద్యం సేవిస్తున్న సమయంలో ఘర్షణకు లోనయ్యారు. ఆ కారణం చేత సూరి మద్యం మత్తులో అక్కడి చింతచెట్టు కింద నిద్రిస్తున్న గజేంద్ర కుమార్‌ను అదేరోజు రాత్రి 11 గం॥ల సమయంలో గొంతుకోసి హత్య చేయడం జరిగింది. అప్పటి ఎస్ఐ మునస్వామి, సిఐ నరసింహులు 2017 మే 8న కేసు నమోదు చేసి ధర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. చివరిగా కేసు విఛారణ చేపట్టిన శ్రీకాళహస్తి ఏడిజే న్యాయస్థానం ముద్దాయి సూరి(36) కి జీవిత ఖైదు, రూ॥2000 లు జరిమానా విధించింది. జరిమానా చెల్లించని యెడల 6 నెలల జైలు శిక్షను విధిస్తూ తుదితీర్పును వెలువరించింది.

## వీధి దీపాలు లేక అంధకారంలో వనదుర్గాపురం

**పాలసముద్రం, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



పాలసముద్రం మండలం అటవీ ప్రాంతంకు సమీపంలోని వనదుర్గాపురం గ్రామ పంచాయతీలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు వీధుల్లోకి రావాలంటే బిక్కుబిక్కుమనే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు గ్రామ అభివృద్ధికి నిధులు లేకపోవడంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని చేతులు ఎత్తివేయడంతో గత 3 నెలలుగా వనదుర్గాపురం గ్రామంలోని వీధి దీపాలు వెలగని పరిస్థితి నెలకొంది. గ్రామంలో వున్న ఎల్ఇడి లైట్లు వెలుగకపోవడం, లైట్లను మరమ్మత్తులు చేయకపోవడం, కొత్త లైట్లు వేయకపోవడం వంటివి ఏమి చేపట్టకపోవడంతో గ్రామస్తులు చీకటితో కాపురం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వనదుర్గాపురం వీధి లైట్ల సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## స్మార్ట్ సిటీ పనులపై సమీక్ష : కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**



తిరుపతి స్మార్ట్ సిటీ పనులపై ఇంజనీర్లతో తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటికే ప్రారంభించిన పనుల వేగవంతానికి కృషి చేయాలని, శ్రీనివాస సేతు పనులను, అదే విధంగా వినాయక సాగర్ తుది దశ పనులని సెప్టెంబర్ రెండవ వారంలోపు పూర్తి చేసేలా అధికారులు, కాంట్రాక్టర్లు పని చేయాలన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించి, నెమ్మదిగా జరుగుతున్న పనులపై మాట్లాడుతూ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, డిఈలు విజయకుమార్ రెడ్డి, దేవిక, గోమతి, మోహన్, ఆప్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పడి వ్యక్తి మృతి

**తిరుపతి క్రైం, ఆగస్టు 9, ప్రభాతవార్త**
మద్యం మత్తులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా వున్నాయి. మృతుడు కొర్లకుంట మారుతి నగర్‌కు చెందిన కె. శేఖర్ (47)గా పోలీసులు గుర్తించారు. మద్యానికి బానిసై భార్యతో గొడవపడిన మృతుడు గత కొంత కాలంగా తనపల్లి ఉంటున్న తల్లి దగ్గర నివాసముంటున్నారు. పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శేఖర్ భార్య వాణి ఓ ప్రైవేటు సంస్థలు కార్మికురాలుగా విధులు నిర్వహిస్తుంది. మృతుడు మద్యం మత్తులో కంపచెట్లలో పడడంతో ఎవరూ గుర్తించకపోవడంతో మృతి చెంది దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించి తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారని ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణం తెట్టు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు టుటౌన్ ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ముత్తరాశిపాళెంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులురెడ్డి(29) తన మిత్రునితో కలసి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా తెట్టువద్ద అదుపుతప్పి మలుపు వద్ద ఉన్న ఆలయం వద్ద ఢీకొనడంతో వాహనం నడుపుతున్న శ్రీనివాసులురెడ్డి కిందపడి తలకు బలమైన గాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితో ఉన్న మిత్రుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

## హరోంహర!

**తిరుత్తణి మురుగన్‌కు టిటిడి పట్టువస్త్రాలు**

**తిరుమల,ఆగస్టు 9ప్రభాతవార్తప్రతినిధి:**



తిరుత్తణిలో ప్రసిద్ధ శైవాలయం వళ్ళీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ఆడిమాసం కృత్తిక పర్వదినం సందర్భంగా బుధవారం టిటిడి నుండి ఈఓ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పట్టువస్త్రాలను, పండ్లు, పూలు భక్తితో తీసుకెళ్ళి తనికేశన్‌కు సమర్పించారు.
తిరుత్తణి ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి అధికారులకు తిరుత్తణి ఆలయ ఛైర్మన్ శ్రీధరన్, ఇఒ విజయ,ఇతర అధికారులు స్వాగతం పలి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహా నిరసనను విజయవంతం చేయండి

**సత్యవేడు, ఆగష్టు09,ప్రభాతవార్త:**
నేడు తిరుపతి కలెక్టర్ వద్ద భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా నిరసనను విజయవంతం చేయాలని ఆపార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్ష్యుడు
మునికృష్ణయ్య, మండల అధ్యక్ష్యుడు జిఎం ప్రతాప్ కోరారు. గ్రామ స్వరాజ్యం కోసం కేంద్రం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు కోసం నిధులు మళ్లించి గ్రామాలకు మొండిచేయి చూపిస్తుందన్నారు. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతగాని పాలనను వ్యతిరేఖిస్తూ సర్పంచులకు మద్ధత్తుగా చేపట్టిన మహా నిరసన కార్యక్రమాన్ని జయప్రధం చేయాలని కోరారు. మండలంలోని సర్పంచులు కూడా పార్టీలకు అతీతంగా వారి నిధుల కోసం తమతో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మోహన్‌బాబు,
వెంకటేశ్వర్లురెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆర్థిక అభ్యున్నతికి సంక్షేమపథకాలు

**సత్యవేడు, ఆగష్టు09,ప్రభాతవార్త:**
నిరుపేదల ఆర్ధికంగా అభ్యున్నతి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.
బుధవారం ఆయన సత్యవేడు మేజర్ పంచాయితీ, దళవాయి అగ్రహారం, ఎన్ఆర్ అగ్రహారాలలో ఏర్పాటు చేసిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎన్ఆర్ అగ్రహారం లో రూ॥ 2లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన త్రాగునీటి బోర్‌ను ప్రారంభించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ పేదలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, ప్రజల వద్ధకు పాలనను సాకారం చేసిన ఘనత ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కే దక్కుతుందన్నారు.
ఈకార్యక్రమంలో జడ్పీటీసి విజయలక్ష్మి, మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి,ఎంపిడివో చంద్రశేఖర్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై పరుగులు తీసిన మునిసిపల్ సిబ్బంది

**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన భక్తులకు సేవలందించుటకు ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చాయి. తమ సేవల్ని అందించారు. భోజనాలు రక రకాల పిండివంటల్ని వితరణగా అందించారు. డివైయస్‌పిగా బీమారావు, కమిషనర్‌గా రమేష్‌బాబు ఇరువురు బాధ్యతలు చేపట్టిన స్వల్ప వ్యవధిలోనే చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. జనం మెచ్చుకునే విధంగా బ్లీచింగ్ క్లీనింగ్, మంచినీటి సరఫరా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం అధికారి అందుబాటులో లేకుండా దుమ్మాకొట్టినా ఛైర్మెన్, సిబ్బంది, ద్వితీయశ్రేణి అధికారులు ఏర్పాట్లను చక్కగా నిర్వహించారు. సిబ్బంది చొరవ అభినందనీయం. ఆలయం వద్ద ఛైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు తిష్టవేసి వచ్చిన భక్తులకు సత్వర దర్శనం,సుదర్శనం ఏర్పాటు చేయటంలో చొరవ చూపారు.

## శ్రీకాళహస్తి జిల్లా కోర్టులో మొదటి తీర్పు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :**
శ్రీకాళహస్తిలో జిల్లా కోర్టు ఏర్పడిన తరువాత బుధవారం మొదటి తీర్పువెలువడింది.నాగలాపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ కేసుకు సంబంధించి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువడింది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగలాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్ సూర్య అనే సూరిపై కేసు నమోదైంది. నందనం గ్రామానికి చెందిన సూరిపై మర్డర్ కేసున మోదైంది.సెషన్స్ ఎస్‌సి నెంబర్ 145/2018 క్రైం నెంబర్ 24/2017కు సంబంధించి వాదోపవాదాలు, పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి అన్వర్‌బాషా నిందితునికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

## ఉప ఎన్నికలకు రెండో రోజు నామినేషన్లు నిల్

**శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



సర్పంచ్, వార్డు సభ్యుల ప్రక్రియపై ఎన్నికల కమిషన్ దృష్టిసారించింది. ఈనేపధ్యంలో ఉప ఎన్నికలకు రెండో రోజు కూడా నామినేషన్లు దాఖలు కాలేదు. తొట్టంబేడు మండలంలోని పెన్నలపాడు సర్పంచ్ పదవికి రెండో రోజు కూడా ఎవ్వరు నామినేషన్లు దాఖలు చేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాఘవేంద్రరావు తెలిపారు. కాగా శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజుపల్లి పంచాయతీలో 5 వార్డులకు, బొక్కసంపాళెం పంచాయతీలో 2 వార్డులు, ఏర్పేడు మండలం జగ్గరాజుపల్లి పంచాయతీలో కందాడ పంచాయతీలో 6 వార్డులు, పంగూరు పంచాయతీలో 10వార్డులు, మడిబాక పంచాయతీలో 3 వార్డులు పెనుమల్లం పంచాయతీలో సర్పంచ్ పదవికి, జంగాలపల్లి పంచాయతీలో 7 వార్డులకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకు నేడు చివరిరోజు. అయితే నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు సమర్పించాల్సిన కుల, ఆదాయ, దృవీకరణపత్రాలు ఇచ్చేందుకు అధికారులు అందుబాటులో

## విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి దర్శనం

**తొట్టంబేడు, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మండలకేంద్రానికి సమీపంలోని బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో వెలసిన వళ్ళీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వారికి బుధవారం ఆడికృత్తిక సందర్భంగా ఉదయం నుంచి స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలతో హారతులిచ్చారు. కాగా శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు సమీపంలో నూతనంగా నిర్మించిన కుమారస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేపట్టారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న వైకాపా : బొజ్జల సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు వైకాపా నాయకులు ప్రజాస్వామ్యానికి పాతరవేసే విధంగా వ్యవహరిస్తున్నారని తెలుగుదేశంపార్టీ నియోజకర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలకు సంబందించి వీడియోను విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పోలీస్‌సర్టిఫికెట్లు, తహశీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ దృవీకరణపత్రాలు, పంచాయతీ కార్యదర్శుల వద్ద ఇంటిపన్నుల చెల్లింపు ధృవీకరణ పత్రాలు అందించాలని అయితే ఉదయం నుంచి తాను పోలీసుశాఖ అధికారులు, తహశీల్దార్‌లు, డిప్యుటీ తహశీల్దార్‌లకు ఫోన్‌చేసిన ఫోన్ స్విచ్‌డ్ ఆప్ అని వస్తోందని, ఇక జిల్లా ఎస్‌పికి ఫోన్‌చేయగా స్పందించలేదని, చివరకు జిల్లా కలెక్టర్ ఫోన్ కూడా స్విచ్ఆఫ్ అని వస్తోందన్నారు. దీనిపై తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నామని సుధీర్‌రెడ్డి తెలిపారు.

## ఇంద్రవిమానంపై కుమారస్వామి దర్శనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తిలో జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాల్లో బుధవారం కృత్తిక సందర్భంగా వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఇంద్రవిమానంలో భక్తులకు దర్శన మిచ్చారు. విమానంలో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ వెంటరాగా ఉత్సవం సాగింది.నాలుగుమాడా వీధులతో పాటు బాబూ అగ్రహారంలలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

## అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**నగరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 పోస్టులకు గాను 16 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి నాగశైలజ, జిల్లా టీకా అధికారి డా. రవిరాజు, నింద్ర తహసీల్దార్ అమరేంద్రబాబు, వైద్యాధికారి రమేష్, జీడీ నెల్లూరు, కార్వేటినగరం, నగరి సీడీపీవోలు వనితశ్రీ, ఏ.పద్మసునంది, కృష్ణవేణి హాజరయ్యారు.

## గంగమ్మ జాతరలో గాలి భానుప్రకాష్

**వడమాలపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



మండలంలోని బంగారెడ్డి కండ్రిగ గ్రామంలో జ ం ^ ం గ ^ ం త ^ ం న ^ న గంగమ్మజాతరలో నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ బుధవారం పాల్గొన్నారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు బంగారెడ్డి కండ్రిగకు వెళ్లి ఆయన అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, దాము యాదవ్, ఉమాపతిరావు, వెంకటయ్య, హేమావతి, దూర్వాసులు, ఉమాపతి, దేగయ్య, షణ్ముగం, పవన్ యాదవ్, అదెయ్య, పెద్దబ్బరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కరుణాకర్‌రెడ్డికి చిల్లీస్ అంజిచే ఘన సన్మానం

**తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 9 ప్రభాతవార్త:**



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి నూతన ఛైర్మన్‌గా గురువారం బాధ్యతలు చేపట్టనున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అధినేత చిల్లీస్ అంజి బుధవారం ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిల్లీస్ అంజి కరుణాకర్‌రెడ్డిని పుష్పగుచ్ఛం,దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియచేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో చిల్లీస్ అంజితో పాటు నగరపాలక కార్పొరేటర్ ఎస్‌కె.బాబు,చేజర్ల మురళి,అంజి స్నేహితుడు రాజా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

**పుత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్, పట్టణం గ్రామీణ ప్రాంతాల్లోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఆడికృత్తిక సందర్భంగా బుధవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి, అలాగే తిరుపతి రోడ్డులో వెలసిన శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో రైల్వే క్వార్టర్స్ సమీపంలో వెలసిన నాగాలమ్మ దేవాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి మనసాదేవి నాగాలమ్మకు, మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మలేషియా మురుగన్ దేవాలయంలో కూడా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన గాలి భానుప్రకాష్

**పుత్తూరురూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్ మండలం తిమ్మరాజుకండ్రిగకు చెందిన మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ సుబ్రహ్మణ్యంరాజు సతీమణి ప్రమీల మృతి చెందింది. ఈ మృతదేహానికి నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జిల్లా జూడో జట్టు ఎంపిక ప్రారంభించిన రాజేష్, భానుప్రకాష్

**తిరుపతి (క్రీడ), ఆగస్టు 9 ప్రభాతవార్త :**
చిత్తూరు జిల్లా జూనియర్ సినీయర్ జూడో జట్టు ఎంపికలను శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్ తిరుపతిలో జిల్లా జూడో సంఘం జెన్ అకాడమి అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్‌లు ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి 70 మంది బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన జట్టు నెల్లూరులో జరుగు రాష్ట్ర స్థాయి జూనియర్ సీనియర్ ఓపెన్ సెలక్షన్ పోటీలలో పాల్గొంటుందని కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా జట్టుకు ఆర్థిక సహాయం సెలక్షన్ చేసిన డాలర్స్ గ్రూప్ దివాకర్ రెడ్డి భానుప్రకాష్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో బంగారు పతకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తేవాలని రాజేష్ అన్నారు. జిల్లా తుది జట్టు ఎంపిక 11న జరుగుతుందని కిరణ్ కుమార్ అన్నారు. జట్టు ఎంపిక డిఎస్ఏ జూడో కోచ్ గోపి, పియిటి కుసుమ కుమారి, మల్లీశ్వరి, శివల సమక్షంలో నిర్వహించారు.

## వైభవంగా ఆడి కృత్తిక ఉత్సవాలు

**విజయపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**



మండలంలో బుధవారం ఆడి కృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండలంలో ఆడికృత్తికను పురస్కరించుకుని తెల్లగుంట, జగన్నాధపురం, విజయపురం, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరం గ్రామాల్లో భక్తులు కావడి తీసుకుని తిరుత్తణి రామగిరి సుబ్రమణ్యస్వామిని దర్శించి మొక్కు చెల్లించారు.

## ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలి

**విజయపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటాలని ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ బబిత తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన విజయపురంలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో శిలాఫలకం ఏర్పాటు చేయాలని, దాని చుట్టూ మట్టి దీపాలు వెలిగించి, మొక్కలు చేతిలో పట్టుకుని ఫోటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

## ఓటర్ల జాబితాలో పొరపాట్లు లేకుండా సిద్ధం చేస్తున్నాం

**తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సిద్ధం చేస్తున్నామని తిరుపతి ఓటర్ నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిసనర్ హరిత పేర్కొన్నారు. బుధవారం తిరుపతి నియోజకవర్గ ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో తన ఛాంబర్ నందు కమిషనర్ హరిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేసేందుకు అన్నీ చర్యలు చేపట్టామన్నారు. తిరుపతి నియోజకవర్గం పరిధిలో 265 పోలింగ్ కేంద్రాలకు 265 మంది బూత్ లెవల్ ఆఫీసర్లను నియమించామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, అర్బన్ ఎంఆర్ఓ వెంకటరమణ, డిటి జీవన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## స్వఛ్చంధంగా స్థలాన్ని అప్పగించండి

**చంద్రగిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:**
ఆసుపత్రి స్థలాన్ని స్వచ్ఛంధంగా ఖాళీచేసి అప్పగించాలని తహశీల్దార్ శిరీషా ఆదేశించారు. ముంగిలిపట్టులో ఆసుపత్రి కొరకు కేటాయించిన 3 సెంట్లు స్థలం 2018లో అప్పటి సర్పంచ్ ధనలక్ష్మి హయాంలో పంచాయతీ తీర్మాణంతో శిధిలావస్థలో గల కట్టడాన్ని కూల్చివేసి, తన సమీప బంధువుల పేరిట పట్టా తీసుకున్నారు. ఇందులో గ్రామానికి చెందిన ధనలక్ష్మి బంధువు రేకుల షెడ్డు (పశువుల పాక) వేసుకున్నారు. సదరు స్థలం ఆసుపత్రికి చెందినదిగా పేర్కొంటూ గ్రామస్థులు అందించిన ఫిర్యాదు మేరకు నాటి తహశీల్దార్ పట్టాను రద్దు చేశారు. అయితే పట్టాను రద్దు చేయడంపై పట్టాదారు కోర్టును ఆశ్రయించడంతో ఇంత కాలం సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ విషయంపై గ్రామస్థులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఈ నేపధ్యంలో బుధవారం తహశీల్దార్ శిరీషా, ఎంపిడిఓ రమేష్‌బాబు, సిఐ రాజశేఖర్ గ్రామానికి చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పట్టాదారుకు ప్రత్యామ్నాయంగా స్థలాన్ని మంజూరు చేయడానికి తహశీల్దార్ హామీ ఇచ్చారు. అధికారుల చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సులోచన, విఆర్ఓ దినేష్, సెక్రటరీ హరిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, టిడిపి నాయకుడు వడ్లమూడి దిలీప్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు ప్రతాప్ స్వామీజీ సారె

**రామచంద్రాపురం, ఆగస్టు 9 ప్రభాతవార్త:**



పరమాల అరుందతీ వాడలో జరుగుతున్న గంగమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ సారెను సమర్పించారు. గ్రామస్థులు, జాతర నిర్వహకులు మేళతాళాలు మంగళవాయిద్యాలు, భాణా సంఛాపేళుళ్ళ నడుమ ఊరేగింపుగా స్వామీజీ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి సారెను స్వీకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రశాంత వాతావరణంలో కమ్మకండ్రిగ ఉపఎన్నిక

**రామచంద్రాపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త:**



ప్రశాంత వాతావరణంలో కమ్మకండ్రిగ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ మహ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం ఆయన మండల పరిషత్ పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2022 జూన్ 5న కాకర్ల లక్ష్మమ్మ మరణించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన ఈ స్థానానికి ఈనెల 19న ఉపఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఎన్నికల నియమావళి అమలులో వుంటుందన్నారు. అభ్యర్థులు నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డ్ కుటుంబానికి చూయూత

రూ. 5 లక్షలు చెక్కును అందజేసిన జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి

తిరుపతి క్రైం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



తిరుచానూరు పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల 20.05.2023వ తేదిన ఏ.పద్మష్ బాబు హెచ్‌జి 107 ఆయన సతీమణి యామినికి హోంగార్డ్స్ ఒక్క రోజు వేతనాన్ని కాంట్రిబ్యూషన్ అమౌంట్ ఐదు లక్షల రూపాయిలు చెక్కును జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి చేతులు మీదుగా పోలీసు ప్రధాన కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో అందజేసారు. తిరుపతి జిల్లా హోంగార్డు యూనిట్‌లో ఏ. పద్మష్ బాబు హోంగార్డ్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల కాలంలో అనారోగ్యంతోమరణించడంతో సహచర హోంగార్డ్స్ అందరూ తన ఒక్క రోజు వేతనాన్ని ఆర్థిక సహాయంగా అందించి, తమ ఉధార స్వభావాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవాలనే సదుద్దేశంతో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులందరూ ఒక్క రోజు వేతనాన్ని ఇచ్చారు. మంచి మనసుతో మంచి కార్యక్రమానికి ముందుకు వచ్చిన హోంగార్డ్స్ అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ హోంగార్డ్స్ సంక్షేమం కొరకు తన నుండి ఎలాంటి సహాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, నా పరిధి మేరకు తప్పకుండా అందిస్తానని జిల్లా పి. పరమేశ్వర రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ వెంకట్రావు, హోంగార్డ్ డిఎస్‌పిడి లక్ష్మణ్ కుమార్, హోంగార్డ్స్ ఆర్ఐ శ్రీనివాసులు హెచ్1 క్లర్స్ జోయల్, హోంగార్డ్స్ ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

## ఆడికృత్తిక ఉత్సవాల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ

తొట్టంబేడు, జూలై 23 ప్రభాతవార్త :




ప్రతి ఏడాది శ్రీకాళహస్తి పట్టణంలో కన్నుల పందువగా జరిగే ఆడికృత్తిక మహోత్సవాలను ఈఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని కార్తీకేయసేవా సంఘం సారథ్యంలో విజ్ఞానగిరికి వచే ్చభక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచే అన్నదానం కార్యక్రమాన్ని ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో ప్రారంభించారు. సుమారు దర్శనానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు పులిహోర, చక్కెరపొంగలి, కేసరి, దద్దోజనం గుగ్గిళ్లు తదితర ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో పలువురు ట్రస్టుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**జై సుబ్రమణ్యేశ్వర స్వామి ట్రస్టు సారథ్యంలో..**

జై సుబ్రమణ్యేశ్వర స్వామి ట్రస్టు సారథ్యంలో ఆలయం వద్ద భక్తులకు పానకం, ప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహ స్తీశ్వరాలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు. జనసేన నాయకులు కొట్టేసాయి ఆధ్వర్యంలో బాబుఅగ్రహారం వద్ద ఆడికృత్తికకు విచ్చేసే భక్తులకు కేసరి పంపిణీచేశారు.

## సుబ్రహ్మణ్యస్వామికి హరోంహర కావళ్ళతో క్యూ కట్టిన భక్తులు

నగరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:



నగరి పట్టణంలో బుధవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. హరోంహర నామస్మరణతో పట్టణం మారుమోగింది. సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసింది. బస్టాండ్ ప్రాంగణంలో పూజా సామగ్రి, పండ్లు, అరటి ఆకులు, కావళ్ల విక్రయాలు జరిగాయి. మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు కావళ్లతో క్యూ కట్టారు. కొత్తపేట అగర వినాయక శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం నిర్వహించారు. తదుపరి సుబ్రహ్మణ్యస్వామిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. పట్టణ పరిధి నుంచి అధిక సంఖ్యలో భక్తులు కావళ్ల సమర్పించడానికి తిరుత్తణికి వివిధ వాహనాల్లో బయలు దేరారు. మున్సిపల్ పరిధి గుడికండ్రిగలోని బోడిగుట్టపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామిని మంత్రి రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ భార్గవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, మండల నాయకులు కావళ్లతో వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

## షార్ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

సూళ్లూరుపేట, ఆగస్టు 9 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలోని హోలీక్రాస్ జంక్షన్ నుంచి కెఆర్‌పి, షార్ బస్టాండ్, రైల్వే గూడ్స్‌షెడ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో షార్‌కు సంబంధించి ఉన్న స్థలాల్లో ఆక్రమణలను తొలగించే కార్యక్రమానికి షార్ అధికారులు బుధవారం శ్రీకారంచుట్టారు. ఇందులో భాగంగా షార్ అధికారి గోపీకృష్ణ, మున్సిపల్ టిపిబిఓ శాంతి, స్థానిక పోలీసులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది షార్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయంలోగా ఈ ఆక్రమణలు తొలగించుకోకపోతే తామే స్వయంగా తొలగించాల్సి ఉంటుందని ఆక్రమణ దారులకు తెలిపారు. కాగా, షార్ రోడ్డులో ఆక్రమణలు తొలగించేందుకు శ్రీకారంచుట్టిన అధికారులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ముందుకు రాకపోవడం పట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో బాపూజీ వీధిలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు 30 అడుగులు విస్తరించారన్న పేరే గాని ప్రస్తుతం ఈ రోడ్డుపై తిరిగి ఆక్రమణలు యధావిధిగా చోటుచేసుకుంటున్నాయి. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపేయడంతో పాదచారులు వెళ్లాలంటే కూడా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి రోడ్డు ఉన్నప్పుడే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ బాగుండేదని, రోడ్డు విస్తరించి ఏమి ప్రయోజనమని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే కచ్చేరివీధి, పార్కువీధి, కూరగాయల మార్కెట్ సెంటర్లలో ఆక్రమణలతో పాటు రోడ్డుపై విక్రయాలు జరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ఆక్రమణలు కూడా పెరిగిపోతున్నాయి. జిఎన్‌టి రోడ్డులోనూ ఇదే పరిస్థితి. గతంలో అధికారులు ఆక్రమణల తొలగింపును చేపట్టినప్పటికీ తిరిగి వాటిని పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరముంది.

## రేపటి కోసం నేటి రోజును త్యాజిద్దాం

- నా భూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం

-వీరులకు వందనం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో కలెక్టర్

**చిత్తూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త:** రేపటి మన కోసం నేటి రోజును త్యాజించి మనకు స్వేచ్ఛ నిచ్చిన వారికి రుణపడి వుందామని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, డిఆర్ఓ రాజశేఖర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రదీప్, సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయ్‌శంకర్‌రెడ్డి, స్వాతంత్ర్య సమరయోదులు టిసి రాజన్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాతృదేశ మట్టికి కృతజ్ఞత తెలుపుతూ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ సగిలి షన్మోహన్ పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాంతత్ర్య సమర యోధుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను ఈ సందర్భంగా స్మరించుకోవాలన్నారు. ఆగస్టు 9 నుండి 30వ తేదీ వరకు జిల్లా స్థాయిలో జరిగే నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 106 సంవత్సరాల వయస్సు కల్గిన స్వాతంత్ర్య సమరయోధులు టిసి రాజన్ ఈ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న తీరు, స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటాలను గుర్తుకు తెచ్చుకొని సభికులకు వివరించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని నేటి యువత అవవరించుకొని ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి - నాదేశం, నేలతల్లికి నమస్కారం - వీరులకు వందనంలో భాగంగా ప్రతి ఒక్కరు మన దేశంను గౌరవించుకొనే విధంగా దేశ సమగ్రతను పెంచేవిధంగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమర యోధులు టిసి రాజన్, రామమూర్తి, కార్గిల్ యుద్ధంలో పాల్గొని ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరుల కుటుంబాలు, గ్యాలెంటరీ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు.

## అరగొండలో వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

తవణంపల్లె, ఆగస్టు 9 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో బుధవారం ఆడికృతిక ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త ఆలయ ధర్మకర్త పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భరణి వేడుకలు నిర్వహించగా, బుధవారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్ల మూలవిరాట్‌లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లను అలంకరించి ధూపదీపనైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి భక్తిశ్రద్దలతో పుష్పకావళ్ళను తీసుకువచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు దేవస్థానం వారిచే ఉచిత తీర్థప్రసాదాలను అందజేశారు. అర్ధగిరి రోడ్డు వద్దనున్న శ్రీహరోహర స్వామీజీ సమాధి వద్ద కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా మండల కేంద్రం తవణంపల్లెలో శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించగా, భక్తులు పుష్పకావళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అపోలో మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అరగొండ అపోలో హాస్పిట్ ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం మేనేజర్ బాబురెడ్డి, అర్ధగిరి ఆలయ పాలకమండలి సభ్యులు సందీప్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, మోహన్ తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

గణనాధుని పట్టువస్త్రాలు సమర్పణ

మండలంలోని అరగొండలో వెలసిన శ్రీస్వయంభువనేశ్వర కుమారస్వామికి మొట్టమొదటి సారిగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమరి ్పంచారు. ఈమేరకు ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు, వేదపండితులు అరగొండలోని ఆలయానికి చేరుకుని పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి సమర్పించారు.

## సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

తిరుపతి (విద్య), ఆగస్టు 9 ప్రభాతవార్త :



ఈ నెల 7వ తేది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ వారు విడుదల చేసిన సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు విద్యా సంస్థల డైరెక్టర్లు ఇ. గిరిధర్, కె. విశ్వనాథ్ ప్రకటించారు. ఈ ఫలితాల్లో ఎస్. అభిజిత్ కుమార్ రెడ్డి 320, ఇ. మోహిత్ కుమార్ రెడ్డి 312, ఎం. దిలీప్ 296, తారకేశ్వర్ రెడ్డి 292, ఎం. వెంకట్ యాదవ్ 291 మార్కులు సాధించి టాపర్లుగా నిలవడంతో పాటు మొత్తంగా 56.70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు. ఈ అద్భుత ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా వారు అభినందించారు.

## వైసిపి అరాచకపాలనకు చరమగీతం రోజు దగ్గరలోనే

-తిరుపతిలో టిడిపి నేతల నిరసన



తిరుపతి,ఆగస్టు 9ప్రభాతవార్త :

రాష్ట్రంలో వైసిపి అరాచకపాలనతో ప్రజలు నాలుగన్నరేళ్ళుగా విసిగిపోయారని, జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన మొగుడ్నికొట్టి మొగసాలకు ఎక్కింది అనే చందంగా తయారైందని టిడిపి నేతలు ఇన్‌ఛార్జి సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, సూరా సుధాకర్‌రెడ్డి, ఆర్‌పి శ్రీనివాసులు, వట్టికుంట చిన్నబాబు, మహేశ్‌యాదవ్, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్‌యాదవ్, కుమారమ్మ తదితరులు విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో సాగు,తాగునీటి ప్రాజెక్టుల నిర్వాకంపై పరిశీలించేందుకు యాత్రచేపట్టిన టిడిపి జాతీయ అధ్యక్షుడు,మాజీ సిఎం చంద్రబాబునాయుడు పర్యటనలో ఈనెల 4వతేదీ అంగళ్ళులో వైసిపి మూకలు దాడిచేసి,వందలామంది టిడిపి కార్యకర్తలకు గాయాలు చేశారన్నారు. తిరిగి టిడిపిపైనే కేసులు బనాయించిడమేగాక ఏకంగా 14ఏళ్ళ సిఎం,పద్ధతి,విలువలున్న నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం నడవడం లేదని, రాజారెడ్డి రాజ్యాంగం అమలుచేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షనేత పర్యటన సమయంలో పోలీసులు భారీ భద్రత కల్పించి, అధికార వైసిపి నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా గృహనిర్బంధం చేయాల్సిన పోలీసులు దగ్గరుండి వైసిపి నేతలతో దాడిచేయించడం జరిగిందని ఆరోపించారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డైరెక్షన్‌లో పోలీసులు దాడికి దిగడం హేయమైన చర్యఅన్నారు. ఎవరూ అడిగేవారే లేరని వైసిపి నాయకులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని, తొందరలోనే వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## అన్ని బాగున్నాయి... ఇక్కడ కూడా అడ్డదారి దర్శనాలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఆడికృత్తిక మహోత్సవాలు ప్రధాన ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుమారస్వామి కొండకు జనం తండోపతండాలుగా వచ్చారు. గతానుభవాలతో ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రిపబ్లిక్‌క్లబ్ మార్గం నుంచి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసారు. ఇందులో విఐపిలు వెళ్ళటానికి అవకాశం కల్పించారు. అయితే ఇక్కడ కూడా శ్రీకాళహస్తీశ్వరాలయంలో లా అడ్డదారి దర్శనాలు తప్పలేదు. క్యూలైన్లు ఏర్పాటు చేసారు.కానీ కట్టడి చేయలేకపోయారు. కొన్ని శాఖల సిబ్బంది తమ పలుకుబడిని చూపి తమ బంధువులను దర్శనాలకు తీసుకెళ్ళటంతో వత్తిడి చోటు చేసుకుంది.ఛైర్మెన్ శ్రీనివాసులు స్వామి గర్భగుడి వద్ద పర్యవేక్షణకు కూర్చోగా క్యూలైన్లలో పలుబడి,అడ్డదారి ప్రవేశాలతో గందరగోళంగా మారింది.కొత్తగా క్యూలైన్ల ప్రయోగం వికటించిందని చెప్పవచ్చు. ఇతర శాఖల అధికారుల సహకారం ఎంతో అవసరం అని భావించిన ఛైర్మెన్ చొరవ చూపారు.కానీ పర్యవేక్షించాల్సిన ఇఓ ఉత్సవాల సమయంలో కూడా అందుబాటులో లేకపోవటం ఆయన జవాబుదారి తనానికి నిదర్శనంగా చెప్పవచ్చు. తలనీలాలు సమర్పించుకొను భక్తులకు నీటి సదుపాయాన్ని కల్పించటంలో ఇంజనీరింగ్ ఇఇ నూకారత్నం,డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఇ వేణుగోపాల్ వారి సిబ్బంది చొరవ ప్రశంసనీయం అన్నారు.

## కపిలేశ్వర ఆలయంలో హరోంహర

-సుబ్రమణ్యస్వామికి విశేషస్నపనం

తిరుపతి,ఆగస్టు 9ప్రభాతవార్త :



ఆడికృత్తిక పర్వదినాన బుధవారం ఉదయం తిరుపతి నగరంలోని సుబ్రమణ్యస్వామి కొలువైన ఆలయాలన్నీ హరోంహర నామంతో మారుమోగాయి. ఆలయ నిర్వాహకులు వళ్ళీదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. కపిలతీర్థంలోని సుబ్రమణ్యస్వామి ఆలయం, అభయ ఆంజనేయస్వామి ఆలయంలోని సుబ్రమణ్యస్వామి ఉత్సవర్లకు, వేశాలమ్మ ఆలయంలోని బాలమురుగన్ స్వామికి, శివాలయాల్లోని మురుగన్ ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు చేశారు.భక్తులు ఉదయం నుండి భక్తితో స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

## దేశ భక్తి చాటుకోవడమే నా భూమి నా దేశం కార్యక్రమం ఉద్దేశ్యం

చిల్లకూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :



దేశ భక్తిని ప్రజలందరూ గుర్తించుకోవడం కోసమే నా దేశం నా భూమి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామ రెడ్డి అన్నారు. బుధవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన నా భూమి నా దేశం కార్యక్రమాన్ని తూర్పు కనుపూరు, పారిచెర్లవారిపాలెం గ్రామాల్లో ప్రారంభించడం జరిగింది. ఈ నెల 9వ తేది నుంచి 12వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయితీల్లో జరుపుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ నిర్మల దేవితోకలిసి పాల్గొనడం జరిగింది. అనంతరం నా దేశం నా భూమి శిలా ఫలకం ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో మన మాతృ భూమి కోసం ఆలోచించడం స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించాలన్నారు. ప్రధాన నరేంద్ర మోడి ప్రవేశ పెట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని అందరూ కలిసి నిర్వహించాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ అన్నాడిశెట్టి కామాక్షమ్మను ఘనంగా సన్మానించడం జరిగింది. పచ్చదనం, పరిశ్రుభత వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ గిరి, పంచాయితీ కార్యదర్శులు చంద్రశేఖర్, సాయిరావమ్మ, స్వాతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తనపల్లి పద్మగిరి కొండపై ఆడికృత్తిక మహోత్సవం

-దంఢాయుధపాణి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

-లక్షలాది మంది భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు

-పెద్దఎత్తున కావడి ఎత్తి మొక్కులు తీర్చుకున్న భక్తులు

తిరుపతిరూరల్, ఆగస్టు 9 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ తనపల్లి శ్రీపద్మగిరి కొండపై వెలసిన దండాయుధపాణి స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాన్ని కన్నులపండవుగా వైభవంగా నిర్వహించారు. ఆడికృత్తికను పురస్కరించుకుని బుధవారం తెల్లవారుఝాము నుండి దండాయుధపాణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. దండాయుధపాణి స్వామిని స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు స్వామివారిని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందజేసారు. ఆడికృత్తికను పురస్కరించుకుని భక్తులు కావళ్ళు ఎత్తుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా శ్రీపద్మగిరి కొండను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ దీపాల శోభ చూపర్లను కనువిందు చేసాయి.

భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసారు.

## మాంబట్టులో కావడి మహోత్సవం

తడ, ఆగస్టు 9 ప్రభాతవార్త :



ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఆడి కృత్తిక ప్రత్యేక పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా తడ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో సుబ్రహ్మణ్యస్వామికి విశేషంగా పూజలు జరిపారు. మండలంలోని చినమాంబట్టు కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రతిష్టించి ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, చందనాలంకారాలు చేశారు. ఈ సందర్భంగా సమీపంలోని పెదమాంబట్టు నుంచి చినమాంబట్టు వరకు కావడి మహోత్సవం జరిపారు. సుబ్రహ్మణ్య స్వామికి ప్రీతిపాత్రమైన ఆరు సంఖ్యతో ఆరుగురు భక్తులు కావడి మోశారు. తిరుపతి భక్తులు వేమనబోయిన మునిరాజ యాదవ్, రమణమ్మ, షణ్ముగంలు ఉభయదాతలుగా వ్యవహరించారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ప్రచార నిర్వాహకులలో ఒకరైన ఎఆర్ రవిచంద్రన్, స్విమ్స్ వైద్యులు ఆరణి మునుస్వామి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ మునిశ్రీనివాసులు, అన్నపూర్ణ అన్నదాన సమాజం అధ్యక్షుడు దేవేంద్రరెడ్డితో పాటు పాముల పురుషోత్తం, విజయలక్ష్మి, మునుస్వామి, మోహన్‌రావు, భాస్కర్, బాలకృష్ణయ్య తదితరులు కావడిలో మోశారు. టిటిడికి చెందిన 25 మంది సాంస్కృతిక బృందం వచ్చి గ్రామంలో కోలాట నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు.

## కావడి మొక్కుల్లు చెల్లించిన మంత్రి రోజా



నగరి, ఆగస్టు 9 ప్రభాతవార్త:

ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి రోజా కావడి మొక్కులు చెల్లించుకున్నారు. సాంప్రదాయ పద్ధతిలో పసుపు చీర ధరించి సుబ్రహ్మణ్యస్వామి వ్రతమాచరించిన ఆమె పుష్పాలతో అలంకరించిన కావడి ఎత్తారు. కుటుంబ సమేతంగా రాష్ట్ర సరిహద్దును ఆనుకుని ఉన్న తమిళనాడులోని సుబ్రహ్మణ్యస్వామి ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని కావడి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోకి ప్రవేశించిన ఆమెకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిసుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకోగా రోజాను, ఆమె భర్త సెల్వమణి, సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి కృష్ణకౌశిక్‌లను ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు.






## అమ్మవారి సేవలో మంత్రి చెల్లుబోయిన

తిరుచానూరు, ఆగస్టు 9 ప్రభాతవార్త :



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సమాచార పౌర సంబంధాల శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆశీర్వాదం మండపంలో వేద ఆశీర్వాచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శైలేంద్ర బాబు, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, విఐ రామ్మోహన్, టెంపుల్ ఇన్స్పెక్టర్స్ ప్రసాద్, అశోక్, గణేష్, సుభాస్కర్, ఆలయ అర్చకులు ఇతర అధికారులు పాల్గొన్నారు.